
# ప్రజాసేవలో లంచాలెందుకు?

## రెవెన్యూ నుంచి వైద్య ఆరోగ్య శాఖ వరకు అవినీతి ఆరోపణలు

## పారదర్శక పాలనతోనే ప్రజలకు న్యాయం




**"ప్రజాసేవే లక్ష్యం కావాలి.. లంచాలే అడ్డంకులు కాకూడదు!"**

ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన అధికారులే లంచాల ఆరోపణల్లో చిక్కుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. భూ సర్వే నుంచి లేఅవుట్ అనుమతుల వరకు, వైద్య కేంద్రాల లైసెన్సుల నుంచి భవన నిర్మాణ అనుమతుల వరకు.. ఏ పని కోసం కార్యాలయానికి వెళ్లినా నిబంధనల ప్రకారం సేవలు అందుతాయనే నమ్మకం ప్రజల్లో ఉండాలి. కానీ కొన్ని చోట్ల పనులు చేయడానికి లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి.

రంగారెడ్డి జిల్లాలో అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిన రూ.20 లక్షల లంచం కేసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన రూ.లక్ష లంచం ఆరోపణలు ఈ సమస్య తీవ్రతను చర్చకు తెచ్చాయి. హైదరాబాద్‌లో భవన నిర్మాణ అనుమతుల వ్యవహారం, ఇతర జిల్లాల్లోనూ వివిధ శాఖల అధికారులపై నమోదైన ఏసీబీ కేసులు ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత ఎంత అవసరమో గుర్తుచేస్తున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగం అంటే అధికారం మాత్రమే కాదు.. ప్రజల పట్ల బాధ్యత కూడా. రైతు తన భూమి సమస్య పరిష్కారం కోసం, వ్యాపారి తన లైసెన్స్ కోసం, సామాన్యుడు ఒక ధ్రువపత్రం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి మారాలి. నిర్ణీత గడువులో సేవలు అందించాల్సిన వ్యవస్థలో జాప్యం, అనవసరమైన అభ్యంతరాలు, మధ్యవర్తుల జోక్యం ప్రజలకు భారంగా మారకూడదు. చట్టబద్ధంగా జరగాల్సిన పనికి లంచం చెల్లించాల్సిన అవసరం ఉండకూడదు.

అవినీతిని అరికట్టడంలో అవినీతి నిరోధక శాఖ పాత్ర కీలకం. ఫిర్యాదులపై వేగంగా స్పందించడం, లంచం డిమాండ్ చేసిన వారిపై ఆధారాలతో చర్యలు తీసుకోవడం, ఆదాయానికి మించిన ఆస్తులపై నిష్పక్షపాతంగా విచారణ జరపడం అవసరం. అయితే ఏసీబీ దాడులతోనే సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. అవినీతికి అవకాశం కల్పిస్తున్న విధానపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దినప్పుడే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో సేవల కోసం స్పష్టమైన గడువులు నిర్ణయించాలి. దరఖాస్తుల స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం కల్పించాలి. అనుమతులు, ఫీజులు, అవసరమైన పత్రాల వివరాలను బహిరంగంగా ప్రకటించాలి. ఒక అధికారి వద్ద పని నిలిచిపోతే ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసే సరళమైన వ్యవస్థ ఉండాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తిని వేధించకుండా రక్షణ కల్పించడమూ అంతే ముఖ్యం. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై విచారణ నిష్పక్షపాతంగా జరగాలి; నేరం నిరూపితమైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ప్రతి ఆరోపణను నిర్ధారిత నేరంగా పరిగణించకూడదు. విచారణ పూర్తికాకముందే వ్యక్తులను దోషులుగా ముద్ర వేయడం సరైంది కాదు. ఆరోపణలపై వాస్తవాలు వెలుగులోకి రావాలి, బాధ్యత నిర్ధారణ కావాలి, చట్టం తన పని తాను చేసుకుపోవాలి. అవినీతి నిరోధక చర్యల్లో పారదర్శకతతో పాటు న్యాయబద్ధత కూడా అవసరం.

ప్రజలు కూడా లంచం డిమాండ్ ఎదురైతే భయపడకుండా చట్టబద్ధంగా ఫిర్యాదు చేయాలి. తెలంగాణ ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఫిర్యాదు చేసే విధానం, అవసరమైన ఆధారాలు, తదుపరి చర్యల విషయంలో ఏసీబీ అధికారుల సూచనలు పాటించాలి.

ప్రజాధనంతో నడిచే ప్రభుత్వ వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అధికారం వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు.. ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలి. లంచం తీసుకుంటూ పట్టుబడిన తర్వాత చర్యలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, లంచం తీసుకునే పరిస్థితులే లేకుండా వ్యవస్థను మార్చడం అంతకంటే ముఖ్యం.

ప్రజాసేవలో నిజాయితీ మినహా మరే ధర ఉండకూడదు. అవినీతిపై ప్రకటనలు మాత్రమే కాదు.. ఆచరణలో మార్పు కనిపించాలి. అప్పుడే ప్రభుత్వ కార్యాలయాలపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది; పాలనకు నిజమైన అర్థం చేకూరుతుంది.

**"పదవులు, బాధ్యతలు ప్రజల కోసం. వాటిని వ్యక్తిగత లాభాల కోసం వాడుకుంటే ప్రజా విశ్వాసం కోల్పోతాం"**

**సంపాదకులు: జ్వాలా దశ న్యూస్..**



# కాంగ్రెస్ గెలుపోటములకు భయపడదు!

- ప్రజలతోనే కాంగ్రెస్ ప్రయాణం.. దేశాభివృద్ధికి పునాదులు వేసింది ఆ పార్టీనే: మంత్రి పొన్నం ప్రభాకర్
- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పారిజాత నరసింహారెడ్డి బాధ్యతల స్వీకరణ


**దశ, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా చిగురింత పారిజాత నరసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గెలుపోటములకు భయపడదని, ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉన్నా ప్రజలతోనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమం నుంచి దేశ నిర్మాణం వరకు కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో ఆహార కొరత ఉన్న పరిస్థితుల నుంచి వ్యవసాయ రంగంలో పురోగతి సాధించే స్థాయికి ఎదగడం, లక్షలాది ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు, విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి కార్యక్రమాలకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పునాదులు వేశాయని వివరించారు. దేశంలో నవరత్న ప్రభుత్వ రంగ సంస్థలు, ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు ద్వారా ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాలు దోహదపడ్డాయని చెప్పారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలకు భారతీయులు సీఈవోలుగా ఎదగడం వెనుక దేశంలో ఏర్పాటైన విద్యా, పారిశ్రామిక వ్యవస్థల పాత్ర ఉందని పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు, స్వతంత్ర సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడటం కాంగ్రెస్ పార్టీ విధానమని మంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఓటములు ఎదురైనా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే పార్టీ లక్ష్యమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన పారిజాత నరసింహారెడ్డి పార్టీని బలోపేతం చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# జైస్వాల్ గార్డెన్‌లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- ధనలక్ష్మి దేవి అవతారంలో మైసమ్మ అమ్మవారు



**దశ, హైదరాబాద్:** జైస్వాల్ గార్డెన్‌లోని శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం అమ్మవారు శ్రీ ధనలక్ష్మి దేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పండుగ సందర్భంగా ప్రతిరోజూ ఉదయం నుంచే ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, నవగ్రహ హోమాలు, లలితా సహస్రనామ కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాలనీవాసులు, స్థానిక ప్రముఖులు మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెరుకు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి. హెచ్. ఇంద్రసేన్ యాదవ్, చైర్మన్ ఎన్. రమేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు కె. దిలీప్ గౌడ్, కోశాధికారి పి. వెంకటేష్ గౌడ్, చీఫ్ సలహాదారులు: జి. ప్రసన్నాంజనేయులు, జి. సురేందర్, ఎ. రామగౌడ్, బి. మధుసూదన్ చారి, పి. శ్రీహరి చారి, కమిటీ సభ్యులు పి. రామస్వామి, కె. ఈశ్వరయ్య, కె. అశోక్ కుమార్, టి. కృష్ణవేణి, కాలనీవాసులు లక్ష్మయ్య గౌడ్, ఎ. సత్యనారాయణ, ఎన్. స్వామి గౌడ్, అంజయ్య గౌడ్, కె. సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, విజయ్ బాబు, శ్రీనివాస్ గుప్తా, కె. శ్రీధర్, రాకేష్, నరేష్, రాంచందర్ రావు, సంతోష్ గుప్తా తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చూపులేని వారికి శ్వేత బెత్తమే దారి చూపే ఆయుధం

- దివ్యాంగుల ఆత్మవిశ్వాసానికి, స్వావలంబనకు ప్రతీక శ్వేత బెత్తం

**దశ ఓయూ:** చూపులేని దివ్యాంగులకు శ్వేత బెత్తం దారి చూపే ఆయుధంగా నిలుస్తుందని ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి అన్నారు. అంతర్జాతీయ వైట్ కేన్ డే సందర్భంగా అక్టోబర్ 15న ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిజేబుల్డ్ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నుంచి వైద్య విద్యా సంచాలకుల కార్యాలయం వరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శిల్పవల్లి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకుడు సర్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం మల్లేశం మాట్లాడుతూ.. దృష్టిలోపం ఉన్నవారు రహదారులపై అడ్డంకులను గుర్తించి, స్వతంత్రంగా ప్రయాణించేందుకు శ్వేత బెత్తం దిక్సూచిలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది కేవలం సహాయక పరికరం మాత్రమే కాదని, దివ్యాంగుల ఆత్మవిశ్వాసం, స్వావలంబన, స్వతంత్ర జీవనానికి ప్రతీక అని పేర్కొన్నారు. దృష్టిలోపం ఉన్నవారికి విద్య, ఉపాధి, రవాణా, బహిరంగ ప్రదేశాల్లో సమాన అవకాశాలు కల్పించాలని, వారి ప్రయాణం సురక్షితంగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్వేత బెత్తంతో వెళ్లేవారికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, దివ్యాంగుల హక్కులను గౌరవిస్తూ వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ వైట్ కేన్ డేను వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్వాహకులు కోరగా, వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకుడు సర్వేశ్వర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిజేబుల్డ్ ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ఎల్.గోపాల్‌రావు, డాట్ రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కే.శ్రీనివాస్‌రెడ్డి, విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్, సంజీవని నేత్రాలయ వైద్యుడు డాక్టర్ అశోక్ సూర్యవంశీ, ఇతర దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టదా?

- ఎల్‌నినో కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం.
- రైతులకు విద్యుత్ అందించకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు.



**దశ, రంగారెడ్డి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధిస్తున్న విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. జిల్లావ్యాప్తంగా సక్రమంగా విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు నెలల తరబడి పెట్టిన పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

పొలాలకు నీరు పెట్టుకునేందుకు రైతులు అర్ధరాత్రి వరకు విద్యుత్ కోసం ఎదురుచూడాల్సి వస్తోందని, ఎప్పుడు కరెంట్ వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో నాలుగైదు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని, మరికొన్ని చోట్ల ట్యాంకర్లతో పంటలను తడపాల్సి వస్తోందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని, వాటి మరమ్మతుల్లో జాప్యం రైతుల కష్టాలను మరింత పెంచుతోందని ఆరోపించారు.

### ఎల్‌నినో సాకుతో తప్పించుకోలేరు

విద్యుత్ కోతలకు ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులే కారణమని చెప్పడం సరికాదని మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. వర్షాలు తగ్గే అవకాశాలు ముందుగానే తెలిసినప్పుడు ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిందని పేర్కొన్నారు. ప్రకృతి పరిస్థితులు ఎలా ఉన్నా వ్యవసాయానికి, ప్రజలకు అవసరమైన విద్యుత్ అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భవిష్యత్తులో విద్యుత్ కొరత రాకుండా భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరా, పూర్తిస్థాయి ఉత్పత్తి నిర్వహణలో సమస్యలు ఎందుకు ఎదురవుతున్నాయో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### అధికారులపై చర్యలతో సమస్య పరిష్కారం కాదు

విద్యుత్ కోతలపై ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెట్టడం సరికాదని ఆయన విమర్శించారు. అధికారులను సస్పెండ్ చేసినంత మాత్రాన రైతుల పొలాలకు విద్యుత్ అందదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 7,000 మెగావాట్ల స్థాయి నుంచి 20,000 మెగావాట్లకు పైగా పెంచినట్లు పేర్కొన్నారు.

ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ కోతలతో పంటలు నష్టపోతున్న రైతులకు తక్షణ సహాయం అందించాలని మంచిరెడ్డి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ తెచ్చిన కరువు: పైలెట్ రోహిత్ రెడ్డి

- ఇది ప్రభుత్వ వైఫల్యమే, ఎల్‌నినోపై ముందస్తు చర్యలు ఏవి?
- కరెంట్ కోతలతో మళ్లీ ఇన్వర్టర్ల కాలం వచ్చింది
- సింగరేణిని అమ్మే కుట్ర చేస్తే ప్రజా ఉద్యమం తప్పదు
- తాండూరు వనరులు కొడంగల్‌కు ధారాదత్తం
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫైర్



**దశ,తాండూర్ ప్రతినిధి:** రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులు, ఎటుచూసినా కనిపిస్తున్న కరెంట్ కోతలు, రైతుల పంట నష్టాలకు పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎల్‌నినో ప్రభావాన్ని ముందస్తుగా అంచనా వేసి తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రోహిత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలు, లోవోల్టేజ్ సమస్యలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో కనిపించకుండా పోయిన జనరేటర్లు, ఇన్వర్టర్లు మళ్లీ బయటకు తీసే దుస్థితి దాపురించిందని, కనీసం ఉన్న విద్యుత్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారని విమర్శించారు. రైతుల సమస్యలు, కరెంట్ కష్టాలు, సింగరేణి భవిష్యత్తుపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో తాండూరులో భూగర్భ జలాల పెంపు కోసం కాగ్నా నదిపై 11 చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తే, నేటి కాంగ్రెస్ పాలనలో కాగ్నా ఇసుక దోపిడీ విచ్చలవిడిగా సాగుతోందని మండిపడ్డారు. తాండూరుకు చెందాల్సిన నీళ్లు, జిల్లా ఆస్పత్రిని కొడంగల్‌కు ధారాదత్తం చేశారని, చివరికి ఇక్కడి ఆర్టీఓ కార్యాలయాన్ని కూడా కొడంగల్‌కు తరలించేందుకు పత్రాంగం నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ జీవనాడి అయిన సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రైవేటీకరణకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని, పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఎండిపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం అందించి, కష్టాల్లో ఉన్న రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఘనంగా ముగిసిన సీఐఎస్‌సీఈ జాతీయ అథ్లెటిక్స్ పోటీలు

*విజేతలకు బహుమతుల ప్రదానం.. క్రీడల్లో రాణించాలని ప్రోత్సాహం*

**దశ ఓయూ:** హబ్సిగూడలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ సీఐఎస్‌సీఈ జాతీయ బాలికల అథ్లెటిక్స్ పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గాడ్విన్ డేనియల్ అథిష్టం విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడల్లోనే కాకుండా జీవితంలోని అన్ని రంగాల్లోనూ ప్రతిభ చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలికలకు సూచించారు. ఈ సందర్భంగా ఆతిథ్య సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రిన్సిపాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల క్రీడల సమన్వయకర్త శ్రీమతి ఎస్. తెరిసా వ్యక్తిగత, జట్టు, ప్రాంతీయ స్థాయిల్లో విజేతలుగా నిలిచిన వారికి ఛాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాలికలు పాల్గొనడంతో హైదరాబాద్‌లో పండుగ వాతావరణం నెలకొంది. భిన్న ప్రాంతాలు, సంస్కృతులకు చెందిన క్రీడాకారిణులు ఒకచోట చేరడంతో నగరం 'మినీ ఇండియా'ను తలపించింది.



## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు కీలకం

**దశ,తాండూర్ ప్రతినిధి:**ఉమ్మడి రంగారెడ్డి హైదారాబాద్ మహబూబ్ నగర్ జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై తాండూరు క్యాంప్ కార్యాలయంలో మనోహర్ రెడ్డి కార్యకర్తలకు పార్టీ పెద్దలకు దిశా నిర్దేశం చేశారు.ఓటు నమోదు నవంబర్ 6వ చివరి తేదీ ఉన్న నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడికి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలి. గ్రామాలు, పట్టణాల్లోని పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుకు ప్రోత్సహించాలి.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలి. ప్రతి గ్రామం, వార్డు పరిధిలో పట్టభద్రుల వివరాలను సేకరించి, అర్హులైన వారి నమోదు స్థితిని పర్యవేక్షించాలి.గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రాముఖ్యతను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఓటరు నమోదు కోసం అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం గురించి అర్హులకు సరైన సమాచారం అందించాలి.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించాలని ఎమ్మెల్యే గారు సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్ గారు, మండల, పట్టణ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## దసరా-బతుకమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: పాడి కౌశిక్ రెడ్డి



**దశ, హుజూరాబాద్:** దసరా, బతుకమ్మ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలకుఎలాంటిఇబ్బందులుకలగకుండాఅవసరమైన అన్నిసౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఇటీవల హుజూరాబాద్ పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఎదురైన ఇబ్బందులు బతుకమ్మ పండుగ రోజున పునరావృతం కాకుండా చూడాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణాల మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అదేవిధంగా వీణవంక, జమ్మికుంట, ఇల్లంతకుంట, కమలాపూర్ మండలాల్లోనూ బతుకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ ఆర్డీఓ ఫోన్ ద్వారా మాట్లాడి తెలియజేశారు. అన్ని మండలాల్లో అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని కోరారు.

బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాల్లో మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలు సౌకర్యవంతంగా వేడుకల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.

పండుగ సమయంలో ఎలాంటి సమస్య తలెత్తినా అధికారులు వెంటనే స్పందించేలా అందుబాటులో ఉండాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళలకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హుజూరాబాద్,జమ్మికుంట పట్టణాలతో పాటు వీణవంక, ఇల్లంతకుంట, కమలాపూర్ మండలాల్లోనూ దసరా-బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు..

## తాండూరు బిగ్ బాష్ లీగ్13 ప్రారంభించిన పైలెట్

- *-తాండూరులో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తా: మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి*



**దశ, తాండూర్ ప్రతినిధి :** తాండూరు పట్టణంలోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న తాండూర్ బిగ్ బాష్ లీగ్13 క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాండూరులో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని, ముఖ్యంగా తాండూరులో స్టేడియం నిర్మాణం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, తాండూరు మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, కౌన్సిలర్ యోగానంద్, నాయకులు వరాల శ్రీనివాస్ రెడ్డి, భీమ్ సింగ్, చెనబసప్ప, హకీమ్ ఖాన్, ఇంతియాజ్, మధు గౌడ్, చెన్నారెడ్డి, చందర్, అస్ఫాక్, టీఆర్ఎస్వీ నాయకులు వినోద్, సందీప్, ఆర్గనైజర్లు రియాన్ ఖాన్, ఆదమ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**దశ, హుజూరాబాద్:** తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు పుట్టినిల్లు బతుకమ్మ పండుగ అంటే ప్రతి ఆడబిడ్డ సంతోషంగా గడిపి పూలను ప్రకృతిగా భావించి పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున రాత్రి హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మహిళలకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు ప్రణవ్. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని ఇంటికి దీపం మహిళలే కాబట్టి వారి అభ్యన్నతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని,రానున్న రోజుల్లో వారి సంక్షేమానికి మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడతామని అన్నారు. నియోజవర్గవ్యాప్తంగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ మహిళా శ్రేణులతో కార్యాలయం కిటకిటలాడింది.అనంతరం మహిళలతో కలిసి ఆడి,పాడారు ప్రణవ్. ఈకార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,అన్ని మండలాల,పట్టణ అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాళ్లు,జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు,ప్రజా ప్రతినిధులు,అన్ని అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తిలక్‌నగర్‌లో మహిళల బతుకమ్మ సంబరాలు



**దశ, వనస్థలిపురం:** వనస్థలిపురం తిలక్‌నగర్ మహిళా మండలి సభ్యులు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళలంతా ఒకచోట చేరి ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెబుతూ పండుగ వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

- *డాక్టర్ సాయి శివ, డాక్టర్ పూజా*



**దశ, హైదరాబాద్:** కొండాపూర్ హైటెన్షన్ రోడ్డులో ఏర్పాటు చేసిన మాత్రిక ఫెర్టిలిటీ అండ్ లాపరోస్కోపిక్ సెంటర్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సాయి శివ, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ పూజా మాట్లాడుతూ.. సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న దంపతులకు ఆధునిక వైద్య సేవలతో పాటు మానసిక భరోసా కల్పించడమే తమ లక్ష్యమన్నారు. రోగులకు వ్యక్తిగత శ్రద్ధ, గోప్యతతో కూడిన నాణ్యమైన చికిత్స అందిస్తామని తెలిపారు. సంతానోత్పత్తి వైద్య సేవలతో పాటు లాపరోస్కోపిక్, కాస్మెటిక్ గైనకాలజీ చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ మల్లికార్జున సి. బారు, డాక్టర్ నవనీత్ మగోన్, మాజీ కార్పొరేటర్లు షేక్ హమీద్ పటేల్, జూపల్లి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి లింగయ్య స్వామి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన పైలెట్ రోహిత్ రెడ్డి



**దశ, తాండూర్ ప్రతినిధి :** తెలుగు పండితులు సిద్ధి లింగయ్య స్వామి అనారోగ్యంతో అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా స్వామి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శలో యాలాల్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు సిద్రాల శ్రీనివాస్, తిమ్మాయిపల్లి కృష్ణ, రిపోర్టర్ ఆసిఫ్, జక్కెపల్లి మొగులయ్య, జక్కెపల్లి గణేష్, బాణపూర్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్ నూతన సీఐని కలిసిన ప్రజాప్రతినిధులు



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ నూతన సీఐ సీహెచ్. రాజును స్థానిక ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి సుష్మ అశోక్ గౌడ్, వార్డు సభ్యులు మొగుళ్ల జీవన్ కుమార్ రెడ్డి, మాచగోని మహేందర్ ముదిరాజ్, గడ్డమీది దశరథ గౌడ్, తూర్పునూరి శివకుమార్ గౌడ్, బొడుసు రాఘవేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## దుర్గాదేవిని దర్శించుకున్న బండా కార్తీక్‌రెడ్డి

- *అన్నప్రసాద వితరణలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు*



**దశ ఓయూ:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మాణికేశ్వరి నగర్ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ బండా కార్తీక్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండారెడ్డి, ఉపాధ్యక్షుడు బానుక ఆంజనేయులు, బీజేపీ నాయకుడు బానుక చరణ్‌రాజ్, కమిటీ సభ్యులు సాల్వేరు మహేష్, ఇద్దయ్య, అంజయ్య, సేటు, నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.